క్లుప్తంగా

శ్రీశైలం భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

ఆదోనిరూరల్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆదోని మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివ భక్తులందరికీ బైచిగేరి బస్టాండుకు ఎదురుగా ఉన్న బీవీఆర్ వెంచర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆదోని బసవేశ్వరకమిటీ సభ్యులు తెలిపారు. దాతల సహకారంతో ఈనెల 1, 2, 3వ తేదీల్లో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని శివభక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



ప్రధాన మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం వంద శాతం మెరుగు పరచాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన బొబ్బలమ్మ గుడి, మరాఠీగేరి, గుల్‌హుసేని దర్గా, బంగారుబజార్, షరాఫ్ బజార్, పెద్ద మార్కెట్ ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో శానిటేషన్‌ను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఏరోజుకారోజు పరిశుభ్రమయ్యే విధంగా తడి–పొడి చెత్తను ఎత్తివేసి వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం కంపోస్టు యార్డును సందర్శించారు. టిడ్కో ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు.

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ



మునిస్వామికి అందజేస్తున్న వలంటీర్ ఉమాదేవి

ఆదోనిటౌన్/సెంట్రల్: ఆదోని పట్టణం 22వ వార్డు ఎస్‌కేడీ కాలనీలో నివాసముంటున్న వృద్ధాప్య పింఛన్‌దారుడు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఉమాదేవి కర్నూలుకు వెళ్లి పింఛన్‌దారుడు మునిస్వామికి పింఛన్ మొత్తం రూ.3 వేలు శనివారం అందజేసి మానవత్వాన్ని చాటుకుంది.


ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: మండలంలోని అన్ని గ్రామాలకు ఆరోగ్యశ్రీ కార్డులను ఈనెల 4వ తేదీలోపు పంపిణీ చేయాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అన్నారు. శనివారం కౌతాళం మండల పరిధిలోని సుళేకేరి, లింగాలదిన్నె సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలానికి మొత్తం 18,614 కార్డులు వచ్చినట్లు తెలిపారు. కొన్ని సచివాలయాల్లో కార్డుల పంపిణీలో జాప్యం జరుగుతోందని.. త్వరితగిన పూర్తి చేయాలని ఆదేశించారు.

మిర్చి వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనం

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామం వద్ద మిర్చి లోడ్డుతో వెళుతున్న బొలెరో వాహనం బోల్తా పడింది. శనివారం మండలంలోని కుంటనహాల్ గ్రామం నుంచి మిర్చి బస్తాలతో కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్‌కు వెళుతుండగా బదినేహాల్ గ్రామం కంబళితాత దర్గా వద్ద యాక్సల్ కట్ అవ్వడంతో వాహనం ఒక్కసారిగా బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న రైతులు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారికి ప్రాథమిక చికిత్స అందించారు. మిర్చి బస్తాలను మరో వాహనంలో మార్కెట్‌కు తరలించారు.

యువకుడి బలవన్మరణం

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన కమ్మరి పవన్‌కుమార్(21) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పవన్‌కుమార్ కొద్దికాలంగా టీబీ, శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. కర్నూలులోని పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసులు తెలిపారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి



ఆదోని పట్టణంలో రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్

మంత్రాలయం: నిరుపేదల సంక్షేమమే జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో 46 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇళ్ల పటాలతో పాటు ఆ స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారని తెలిపారు. జగనన్న చేస్తున్న మేలు మరువరాదన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలు

ఆదోనిరూరల్: అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ అన్నారు. శనివారం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరిలో శనివారం స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొత్తం 546 పట్టాలకు గానూ 180 రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వమే పేదలకు ఉచితంగా స్థలాలని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ జయరామిరెడ్డి, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, మండిగిరి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పీఎంసీ చైర్మన్ ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మధుసూదనశర్మ



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి శనివారం లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ ఇంటి వద్ద 241 మంది లబ్ధిదారులకు జగనన్న లేఅవుట్ రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను పంపిణీ చేశారు.

35వ వార్డులో రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ఆదోనిఅర్బన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 35వ వార్డు పంజరాపోల్ కాలనీలో మహిళలకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి పేద మహిళ పేరిట స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి సహకారం అందించి, పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. అలాగే పేదలకు అనారోగ్యం చేస్తే కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఇంటికి రావాలనే ఆకాంక్షతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డు పరిధిని రూ.25 లక్షలకు పెంచారని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది హరికృష్ణ, ఏఎన్ఎం ఈరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కురువ రవికుమార్, అబ్రహాం, అగ్గి రాముడు, షేక్షావలి, నాగేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు

ఇంటింటికి వెళ్లి రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

ఆదోనిరూరల్: ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని 16వ వార్డులో అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు వై.పి.గంగాధర్, గంగన్న తెలిపారు. సెంటు స్థలాన్ని లబ్ధిదారుల పేరు మీద రిజిస్టర్ చేసి పత్రాలను అందించినట్లు చెప్పారు కార్యక్రమంలో నాయకులు ఉసేని, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



మాట్లాడుతున్న డీఈఓ కె.శామ్యుల్

ఆదోని సెంట్రల్: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి కె. శామ్యుల్ ఆదేశించారు. శనివారం పురపాలక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు ఒకరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 8, 9 తారీఖుల్లో పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు వస్తాయన్నారు. 35 పోలీసు స్టేషన్లలో ప్రశ్న పత్రాలను భద్రపరచడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 162 సెంటర్లలో 36,000 మంది విద్యార్థులు పరీక్షలు రాయస్తున్నారని చెప్పారు. జిల్లాలో 6 సమస్యాత్మక సెంటర్లను గుర్తిచామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమోరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలు వరకు ఉంటాయని, విద్యార్థులు ఉదయం 8.45 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అదే రోజు ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 17 సెంటర్లలో 3000 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ చంద్రభూషణ్, ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, ఎంఈఓ–1 రాజేంద్ర ప్రసాద్, రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలసలు నివారించాలి

ఆదోనిరూరల్: ఆదోని డివిజన్‌లో కరువు కారణంగా వ్యవసాయ కూలీలు, రైతులు వలసలు వెళ్తున్నారని, వలసల నివారణకు అధికారులు ఉపాధి పనులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు కోరారు. శనివారం వారు మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఈనెల 5న ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నామని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మూడు నెలలు దాటుతున్నా చేసిన పనులకు ఉపాధి కూలీలకు వేతనాలు అందించడం లేదన్నారు. కూలీలకు కనీస వేతనం రూ.400 నుంచి రూ.500 చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు గ్రావెల్ వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత

పెద్దకడబూరు: మండల పరిధిలోని పెద్దకడబూరు నుంచి ఆదోని రహదారిలోని కపటి గ్రామం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు సొంత నిధులతో రోడ్డు మరమ్మతులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సుమారు 10 కి.మీపైగా రోడ్డుకు గ్రావెల్ వేశారు. స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి పనులను పరిశీలించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారికి శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు.

పాఠశాల విద్యపై నిబంధనలు సరికాదు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షులు సి.నాగరాజు

ఆదోని సెంట్రల్: పాఠశాల విద్యపై కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనలు సరికాదని ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు సి. నాగరాజు తెలిపారు. శనివారం ఎస్టీయూ అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. 1వ తరగతిలో చేరాలంటే ఆరేళ్ల వయస్సు ఉండాలనే నిబంధనతో ప్రాథమిక విద్య నిర్వీర్యమవుతుందన్నారు. కేంద్రం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకుండా యథావిధిగా 5 ఏళ్లు నిండిన పిల్లలు పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీ యూ రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప, జిల్లా అదనపు కార్యదర్శి సుంకన్న, నాయకులు రామాంజినేయులు, సుధాకర్ బాబు, రాంమోహన్‌రెడ్డి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. లక్ష విరాళం



దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలోని ఈరన్నస్వామి దేవాలయ రాజగోపుర నిర్మాణానికి శనివారం భక్తులు రూ. లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన గుజ్జర్ వివేక్ భవాని, గుజ్జర్ నారాయణరావు, గుజ్జర్ లక్ష్మీబాయి ఈ నగదు అందజేసినట్లు చెప్పారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు అందజేయాలని కోరారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మంత్రాలయం: మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణమూర్తి హెచ్చరించారు. శనివారం మాధవరం తండా, మాధవరం చెక్ పోస్ట్‌ల వద్ద ముమ్మరంగా దాడులు నిర్వహించారు. తండాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి గ్రామ శివారులోని 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. అలాగే మాధవరం చెక్‌పోస్ట్ వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 136 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. స్కూటర్‌పై కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన ఖాసీమ్ సాబ్ కర్ణాటక ప్రాంతానికి చెందిన 5 బీర్ బాటిళ్లు తీసుకొస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

– ఆదోనిలో భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అధికారులు

ఆదోనిటౌన్: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయిద్దాం.. పోలియో రక్కసిని తరిమికొడదామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శనివారం ఆదోని పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, కమిషనర్ రామచంద్రారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ వీధుల్లో ర్యాలీ సాగింది. కమిషనర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ సత్యవతి మాట్లాడారు. ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు హరినాథ్, మంజునాథ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్‌లు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించండి

కోసిగి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్ కుమార్ అన్నారు. కోసిగిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. కోసిగి పీహెచ్‌సీ పరిధిలో 9,268 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఎస్ నారాయణమ్మ, రాముడు పాల్గొన్నారు.



కోసిగిలో అవగాహన ర్యాలీ

అవగాహన ర్యాలీ

కౌతాళం: పిల్లలకు పోలయో చుక్కలు వేయించాలని మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5,132 మంది పిల్లలు ఉన్నట్లు వైద్యాధికారిణి పావని తెలిపారు. బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5,648 మంది పిల్లలు ఉన్నట్లు డాక్టర్ ఇమ్మానియల్ తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతిచెందాయి. గొర్రెల కాపరుల వివరాల మేరకు.. శనివారం గ్రామానికి చెందిన కరిబసప్ప, చెన్న బసప్ప, నాగరాజు, వీరనాగప్ప తమ పొలాల్లో గొర్రెలు మేపుతున్నారు. పెద్ద గొర్రెలు మేత కోసం తోలుకెళ్లారు. పిల్లలను పొలాల్లో కంపె వేసి నిలిపివేశారు. ఎవరూ లేని సమయంలో కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేశాయి. ఇందులో 20 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని కోసిగి భూగేని చెరువు వద్ద నిర్వహించిన ఎద్దుల బండి గిరక పోటీల్లో విజేతలకు శనివారం నగదు బహుమతులు అందజేశారు. పెండేకంటి బసయ్య తన ఎద్దులను 10 నిమిషాల్లో 2356 అడుగులు పరుగెత్తించి మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. కాడయ్య వీరేష్ 10 నిమిషాల్లో 2343.7 అడుగులతో ద్వితీయ స్థానం, బుళ్లోలి లంబయ్య 10 నిమిషాల్లో 2325 అడుగులతో తృతీయ స్థానం, శ్రీరాములు ఎద్లు 10 నిమిషాల్లో 2286 అడుగులు పరుగెత్తి నాల్గో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి సహకారంతో ఎంపీపీ ఈరన్న, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు సభ్యుడు నరసింహులు, వీరేష్, రాజేష్ శాలువా, పూలమాలలతో సన్మానించారు. మొదటి స్థానంలో నిలిచిన రైతుకు రూ.21 వేలు, ద్వితీయ స్థానం రూ.15వేలు, తృతీయ స్థానం రూ.10వేలు, చతుర్థ స్థానం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాన్వి ఈరన్న, శ్రీరాములు, లక్ష్మీరెడ్డి, నరసింహులు, వీరేష్, రాజు, కాడయ్య బాబు యువరాజు పాల్గొన్నారు.

ఎడ్ల గిరక బండి పోటీలు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో కాశీలింగేశ్వస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం ఎడ్ల గిరక బండి పోటీలు నిర్వాహించారు. మొదటి బహుమతి హనుమంత రాయుడు ఎడ్లు, రెండవ బహుమతి బోయ కళ్యాణ్, మూడవ బహుమతి కురవ అయ్యాలప్ప, నాల్గవ బహుమతి బోయ రామకృష్ణ ఎడ్లు గెలుచుకున్నాయి. విజేతల యజమానులకు వరుసుగా రూ.10,016, రూ.7,016, రూ.5,016, రూ.2,516 నగదు బహుమతులను దాతలు సోమేశ్వరరెడ్డి, నాగేష్‌గౌడ్, డి.రంగన్న, వెంకటేశ్వరరెడ్డి విజేతలకు అందజేశారు.

5న జాబ్ మేళా

ఆలూరు రూరల్: ఈనెల 5 స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సూరప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడ్లు పూర్తి చేసిన వారు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్హత, కులధ్రువీకరణ పత్రాలు, బయోడేటా ఫారం, 5 పాస్ ఫొటోలు ఆధార్ కార్డుతో జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ మంచిని వివరిద్దాం



బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కౌతాళం: మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించారు. మండల సచివాలయ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లింగన్నగౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో పోలింగ్ బూత్ వారిగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కమిటీ ప్రతి రోజూ 5 నుంచి 10 ఇళ్లను సందర్శించి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. నాయకులు ఉమాదేవి, కురువ ఆదెప్ప, బొగ్గరుగౌడ్, ఈశప్పగౌడ్, ముదెప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



కోసిగి: పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

కోసిగి: కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తెలుగు పరీక్షకు 276 మంది విద్యార్థులకు గాను 118 మంది హాజరయ్యారు. 158 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాఘవేంద్ర తెలిపారు. అలాగే నారాయణ కాలేజీలో 207 మందికి గాను 195 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ ఉదయ్‌భార్గవ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.